నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | సోమవారం 6 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## తాండూర్‌లో ఫ్లాగ్‌మార్చ్



బీఎస్‌ఎఫ్ జవాన్లు, పోలీసు సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్

తాండూర్, మే 5 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే కుమారస్వామి సూచించారు. ఆదివారం సాయంత్రం తాండూర్ మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకు వద్ద నుంచి ఐబీ కేంద్రం మీదుగా తాండూర్ పోలీస్ స్టేషన్ వరకు బీఎస్‌ఎఫ్ బలగాలతో పాటు స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ డీఎస్పీ రాకేశ్‌మిత్ర, తాండూర్ అదనపు ఎస్ఐ చంద్ర మిస్త్రీ, మాదారం భీమిని, కన్నెపల్లి ఎస్ఐలు గొల్లపల్లి అనూష, విజయ్, గంగారాం పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో అమిత్ షా పర్యటన



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న అమిత్ షా

ఆసిఫాబాద్, మే 5 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన వికాస సంకల్ప యాత్రలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాల్గొన్నారు. ముందుగా గిరిజనుల ఆరాధ్య దైవమైన నాగోబా, సరస్వతీ దేవి, సేవాలాల్ మహరాజ్‌తో పాటు స్వాతంత్ర్య సమర యోధులు కుమ్రం భీం, కొండా లక్ష్మణ్ బాపూజీకి వందనాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని స్కాములే ఉంటాయన్నారు. కాంగ్రెస్.. ఓవైసీ ఒక్కటేనని, అందుకే రామమందిర ప్రారంభోత్సవానికి రాహుల్ గాంధీ హాజరు కాలేదన్నారు. ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం సోదరీమణులు సంతోషంగా ఉన్నారన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తామన్నారు.

# బీఆర్‌ఎస్‌లో జోష్

- అధినేత రోడ్‌షోతో మారిన రాజకీయ ముఖచిత్రం
- కేసీఆర్ ప్రసంగంతో ఫుల్ ఖుష్
- సింగరేణి కార్మికులు, అన్నదాతలు సహా అన్ని వర్గాలను ఆకట్టుకున్న గులాబీ దళపతి
- జిల్లాల రద్దు అంశంపై జోరుగా సాగుతున్న చర్చ
- జిల్లాలో ఒక్కసారిగా పెరిగిన గ్రాఫ్
- కొప్పుల గెలుపు ఖాయమంటూ ధీమా వ్యక్తం చేస్తున్న శ్రేణులు
- ప్రత్యర్థి పార్టీల్లో ఆందోళన





శనివారం నిర్వహించిన మంచిర్యాల రోడ్ షోకు తరలివచ్చిన అశేషజనవాహిని. మాట్లాడుతున్న గులాబీ దళపతి కేసీఆర్, ప్రజలకు అభివాదం చేస్తున్న పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఈశ్వర్

మంచిర్యాల ప్రతినిధి(నమస్తే తెలంగాణ)/ మంచిర్యాల టౌన్, మే 5 : ''పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవడం పక్కా.. పెద్దపల్లిలో కొప్పుల ఈశ్వర్ గెలుస్తున్నడు. సర్వేలన్నీ ఇదే చెబుతున్నయ్''.. అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. పెద్దపల్లితో పాటు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లోని జిల్లాలు రద్దు చేస్తారంట కాంగ్రెసోళ్లు.. మరి జిల్లాలు ఉండాలి అనుకునేటోళ్లు బీఆర్‌ఎస్‌కు.. వద్దు అనుకునే వాళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయండం టూ ఇచ్చిన పిలుపు ఇప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ ఒక్క రోడ్ షోతో ప్రజలను ఆలోచింప చేయడంతో పాటు బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయవకాశాలను మెరుగుపరిచారంటూ రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా కేసీఆర్ రోడ్ షోకు హాజరైన జనం, ఆయన ప్రసంగం గురించే చర్చ నడుస్తున్నది. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో జోష్ పెరిగింది. ప్రచారంలో దూకుడు పెంచిన గులాబీ లీడర్లు కేసీఆర్ ప్రస్తావించిన అంశాలే ఆయుధంగా దూసుకెళ్లిపోతున్నారు. ఎక్కడికెళ్లినా మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలు ఉండాలంటే బీఆర్‌ఎస్ ఎంపీనే గెలిపించాలంటూ చెబుతున్నారు. మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో జిల్లాల రద్దు అంశంతో పాటు కేసీఆరే కొప్పుల ఈశ్వర్ గెలుస్తున్నడని చెప్పిం డు.. ఆయనే గెలుస్తడేమో అనే పాజిటివ్ టాక్ నడుస్తున్నది. దీంతో ఒక్కసారిగా ఉమ్మడి జిల్లాలో రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. నిన్న..మొన్నటి వరకు కార్యకర్తలు, నాయకుల్లో ఉన్న అపోహలన్నీ కేసీఆర్ టూర్‌తో పటాపంచలైపోయాయి. గులాబీ దళపతి ఇచ్చిన బలంతో పెద్దపల్లి, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ శ్రేణులు ముందుకుసాగుతున్నాయి.

### కాంగ్రెస్‌పై వ్యతిరేకత.. బీఆర్‌ఎస్‌పై ప్రేమ..

ఐదు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది. కేసీఆర్ తన ప్రసంగంలో ప్రభుత్వ పాలన వైఫల్యాలను ఎండగట్టడం, ఆరు గ్యారంటీలను ప్రశ్నించడంతో జనంలోకి చొచ్చుకుపోయారు. రెండు లక్షల రుణమాఫీ అయ్యిందా... వరికి రూ.500 బోనస్ వచ్చిందా.. కల్యాణలక్ష్మి తులం బంగారం వచ్చిందా.. మహిళలకు 2500 వచ్చాయా... అంటూ కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. సింగరేణి ప్రైవేటు పరం అంశాన్ని ప్రస్తావించి కార్మిక పక్షపాతిగా నిరూపించుకున్నారు. కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతను బీఆర్‌ఎస్‌పై ప్రేమగా మార్చడంలో కేసీఆర్ వందకు వందశాతం సక్సెక్ అయ్యారు. రైతులు, సింగరేణి కార్మికులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి ఆగమైపోయినమనే డైలమాలో ఉన్న ప్రజానీకానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందనే భరోసాను కల్పించారు. ఇక బీజేపీతో తెలంగాణకు ఒరిగేది ఏముండదంటూ మరోసారి చెప్పకనే చెప్పారు. దీంతో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు డైలమాలో పడిపోయారు. కేసీఆర్ ప్రస్తావించిన అంశాలకు ప్రజలకు ఏం సమాధానం చెప్పాలో తెలియక తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. కేసీఆర్ చేసిన దాడితో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లోకి ప్రత్యర్థి పార్టీలు వెళ్లిపోయాయి.

### జిల్లాలు రద్దు చేస్తే యుద్ధం..

కొత్త జిల్లాలను రద్దు చేస్తామని కాంగ్రెస్ అంటున్నది.. చావునోట్ల తలపెట్టి కొట్లాడి తెచ్చిన తెలంగాణ ఆగమైపోతే మౌనం వహించబోను.. జిల్లాలను రద్దు చేస్తే యుద్ధం చేద్దామన్న పిలుపుతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల మనసును గెలుచుకున్నారు. ఎందుకంటే ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు మంచిర్యాల, ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ పోవాలంటే నూరు.. నూటయాభై కిలోమీటర్లు పోవాల్సి వచ్చేది. ఇగ మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలైతే ఒక్క రోజు పోయి, మరుసటి రోజు పని చూసుకొని, మూడో రోజూ తిరిగి రావాల్సి వచ్చేది. కొత్త జిల్లాలతో ఆ బాధలు తప్పినయ్. ఇప్పుడు ఉన్నఫలంగా ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేస్తే మళ్లీ పాత కష్టాలు వస్తాయి. ఇప్పుడిప్పుడే తెల్లబడుతున్న గిరిజన తండాలు, గూడేలు మళ్లీ అంధకారంలోకి నెట్టబడుతాయి. కేసీఆర్ చెప్పిందే నిజం...గీ జిల్లాలు గిట్లనే ఉండాలనే భావన ప్రజల్లో పెరిగింది. ఏదో జరుగుతుందని మార్పు కోరుకుంటే ఇంత గోస పడాల్సి వస్తుందనుకోలేదంటూ చాలా మంది మాట్లాడుతున్నారు. ఇదే ట్రెండ్‌లో వెళ్తే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తిరుగు ఉండబోదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఒక్క బస్సు యాత్ర ఉమ్మడి జిల్లా రాజకీయాలనే మార్చేసిందని.. బీఆర్‌ఎస్ గ్రాఫ్ అమాంతం పెంచేసిందనే చర్చ నడుస్తున్నది. ఇదే ఉత్సాహం కొనసాగితే ఎన్నికల ఫలితాలను తిప్పేయడం ఖాయమనే విశ్లేషణలు మొదలయ్యాయి. మొత్తానికి ఒక్క కేసీఆర్ రోడ్‌షో ప్రత్యర్థి పార్టీలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నదనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదే జోష్ మరో వారం రోజులు నడిస్తే ఎన్నికల ఫలితాలు బీఆర్‌ఎస్ అనుకూలంగా మారిపోయే పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నది.

# రేవంత్‌వి దొంగ ప్రమాణాలు

- ఆ పార్టీని ప్రజలెవ్వరూ నమ్మరు
- కారు గుర్తుకు ఓటేసి కొప్పులను గెలిపించాలి
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- ముల్కల్ల గ్రామంలో ఇంటింటా ప్రచారం



హాజీపూర్ : ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

హాజీపూర్, మే 5 : సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా దొంగ ప్రమాణాలు చేస్తున్నారని, ప్రజలెవ్వరూ కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో లేరని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, సాగి వెంకటేశ్వర్ రావు, చింతపండు రాయలింగు, మొగిలి సత్యం, శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సక్కు గెలుపు ఖాయం..

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- గాదిగూడ మండలంలో విస్తృత ప్రచారం

నార్నూర్, మే 5 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు ఖాయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పష్టం చేశారు. ఆదివారం గాదిగూడ మండలంలో పార్టీ శ్రేణులతో విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలంలోని మారుమూల గ్రామాల్లో పర్యటిస్తూ గడప గడపకూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆడ చంద్రకళ, వైస్ ఎంపీపీ యోగేశ్, నార్నూర్, గాదిగూడ మండలాధ్యక్షులు పుసంబాధిరావ్, మెస్రం హన్మంత్‌రావ్, నార్నూర్ వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఆత్రం వామన్, విష్ణు ఫడ్, సయ్యద్ ఖాసీం పాల్గొన్నారు.



గాదిగూడలో ప్రచారం చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

## ట్రాఫిక్ తిప్పలు తప్పేదెప్పుడు

మంచిర్యాల ఏసీసీ, మే 5: జిల్లా కేంద్రంలోని మారుతీనగర్‌లో గల కార్మల్ స్కూల్‌లో ఆదివారం నీట్ పరీక్ష నిర్వహించారు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అయ్యి సుమారు రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. కాలనీ వాసులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్మల్ స్కూల్ ఏరియాలో ప్రతిసారీ ఇదే సమస్య ఎదురవుతుందని, సంబంధిత అధికారులు స్పందించి పరిష్కారానికి చొరవ చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



కార్మల్ స్కూల్ ముందు ట్రాఫిక్‌లో ఇరుక్కపోయిన వాహనాలు

## అపూర్వ సమ్మేళనం




శ్రీరాంపూర్ : సాందీపని హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

శ్రీరాంపూర్, మే 5 : శ్రీరాంపూర్ కాలనీలోని సాందీపని హైస్కూల్‌లో 2004-05లో పదో తరగతి చదివిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకే చోట చేరి ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఆటాపాటలతో సందడి చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుల ఆత్మకు శాంతి చేకూరాలని 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కార్తీక్, రత్నాకర్, అలేఖ్య, పావని, మల్లేశ్, నరేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అడవులతోనే మనుగడ సాధ్యం



ముదిగుంట ప్లాంటేషన్‌లో ఫైర్‌లైన్స్ ఏర్పాటును పరిశీలిస్తున్న సురేశ్‌కుమార్

- అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- టీఎస్‌ఎఫ్‌డీసీ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్

జైపూర్, మే 5 : అడవులతోనే మనుగడ సాధ్యమని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఎఫ్‌డీసీ) మేనేజర్ గోగు సురేశ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ముదిగుంటలో ప్రజలు, పశువుల కాపరులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వేసవి నేపథ్యంలో అడవులు, ప్లాంటేషన్ ఏరియాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే పర్యావరణానికి ఎంత నష్టమో వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్లాంటేషన్ వాచర్లు రాత్రిళ్లు కాపలా కాస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల రేంజ్ పరిధిలోని జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాల్లోని అటవీ ప్రాంతా ల్లో నీలగిరి, టేకు ప్లాంటేషన్‌లు విస్తరించి ఉన్నాయని, వీటి రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అగ్ని ప్రమాదాల నివారణకు, వానకాలంలో మొక్కలు పెంచడానికి ప్రజాప్రతినిధులతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అటవీ ప్రాంతాల మీదుగా వెళ్లేవారు బీడీలు, సిగరెట్‌లు తాగి నిర్లక్ష్యంగా పడేయవద్దన్నారు.

## పల్లె ప్రకృతి వనం.. కళావిహీనం



కౌటాల : కళావిహీనంగా తలోడి పల్లె ప్రకృతి వనం..

కౌటాల, మే 5 : అధికారుల పట్టింపులేని తనంతో కౌటాల మండలంలోని తలోడి పల్లె ప్రకృతి వనం ఆనవాళ్లు కోల్పోయి అధ్వానంగా మారింది. కేసీఆర్ సర్కారులో ఆహ్లాదకరంగా తీర్చి దిద్దిన ఈ వనం.. ప్రస్తుతం కళావిహీనంగా మారింది. పూలు, పండ్ల మొక్కలు ఎండిపోయాయి. వాకింగ్ ట్రాకర్స్, పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన వస్తువులు ధ్వంసమయ్యాయి. కంచెలు దొంగలు ఎత్తుకుపోయారు. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు మండిపడుతున్నారు.

# విద్యుత్‌ను ఆదా చేసుకుంటే అధిక లాభాలు

**మంచిర్యాల నోడల్ ఆఫీసర్ సీజీఎం రాజు చౌహాన్**



పోస్టర్ విడుదల చేస్తున్న మంచిర్యాల నోడల్ ఆఫీసర్ సీజీఎం రాజు చౌహాన్

చెన్నూర్ రూరల్, మే 5 : ప్రతి ఇంటిలో విద్యుత్‌ను ఆదా చేసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల నోడల్ ఆఫీసర్ సీజీఎం రాజు చౌహాన్ అన్నారు. ఆదివారం చెన్నూర్‌లో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ తెలంగాణ ఆధ్వర్యంలో విద్యుత్ భద్రతా పొదుపు సూచనలతో కూడిన పోస్టర్ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌ను ఆదా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రమాదాల నివారణకు సూచనలు పోస్టర్‌లో ఉన్నాయన్నారు. ప్రతి గ్రామానికి ఈ పోస్టర్ వెళ్లే విధంగా చూడాలని, విద్యుత్ ఆదా చేయడంతో కలిగే ప్రయోజనాలు వినియోగదారులకు వివరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల ఎస్ఈ శ్రావణ్, డీఈ కైజర్, చెన్నూర్ ఏడీఈ రవికుమార్, ఏఈలు శ్రీనివాస్, భాస్కర్, వెంకటేశ్వర్లు, భీమారం, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్ ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతను దర్శించుకున్న బాల్క సుమన్



రామకృష్ణాపూర్: పోచమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

రామకృష్ణాపూర్, మే 5 : క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 8వ వార్డు గద్దెరాగడిలో గ్రామ దేవత పోచమ్మ తల్లి ఎదురుకొలుపు పూజా కార్యక్రమాన్ని పురస్కరించుకొని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ ఆశీస్సులతో వార్డు ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రాజారమేశ్, కౌన్సిలర్లు ఆలుగుల శ్రీలత సత్తయ్య, వార్డు ప్రజలు పాల్గొన్నారు.